ఆ 12000 మందికీ

# 6 నెలల్లో ఉద్యోగాలు

- జనవరిలో మళ్లీ కాలేజీ ప్రాంగణాలకెళ్తాం
- ఇన్ఫోసిస్ ఎండీ గోపాలకృష్ణన్

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** ఏడాదికి పైగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇన్ఫోసిస్ ఉద్యోగార్థుల ఆశలు మరో ఆరు నెలల్లో నెరవేరబోతున్నాయి. జేబుకు ఇన్ఫోసిస్ కార్డు తగిలించుకునే రోజు ఇక ఎన్నాళ్లో లేదన్న విషయం ఆ సంస్థ సీఈఓ గోపాలకృష్ణన్ చెప్పిన మాటలను బట్టి స్పష్టమవుతోంది. కిందటేడాది ఏప్రిల్ నెలలోవివిధ విద్యా సంస్థల ప్రాంగణాలకు వెళ్లిన ఇన్ఫోసిస్.. సుమారు 18000 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసింది. అంతేకాదు.. హామీ పత్రాలు కూడా అందజేసింది. వీరంతా ఈ ఏడాది జూన్ కల్లా కంపెనీలో చేరాల్సి ఉంది. అయితే.. ఆర్థిక మాంద్యం, ఐటీ పరిశ్రమ ఒడుదొడుకుల నేపథ్యంలో నియామకాల్లో జాప్యం జరిగింది. ఇప్పటిదాకా 6000 మందిని ఉద్యోగాల్లోకి తీసుకున్నామని, మిగిలిన 12000 మందిని వచ్చే డిసెంబరు -జనవరి నాటికి నియమించుకుంటామని ఇన్ఫోసిస్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ ఎస్.గోపాలకృష్ణన్ తెలిపారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) దక్షిణ ప్రాంత విభాగానికి డిప్యూటీ ఛైర్మన్‌గా గోపాలకృష్ణన్ వ్యవహరిస్తున్నారు. సీఐఐ బుధవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన గోపాలకృష్ణన్.. విలేకరులతో మాట్లాడారు. కొత్తగా నియమిస్తున్న వారికి శిక్షణ సమయాన్ని మూడున్నర నెలల నుంచి ఆరు నెలలకు కంపెనీ పెంచామని చెప్పారు. ఇప్పటి వరకూ ఒకే సాంకేతిక పరిజ్ఞానంపై కంపెనీ శిక్షణ ఇస్తోంది. ఇక రెండు టెక్నాలజీలలో కొత్త వారు శిక్షణ పొందుతారని గోపాలకృష్ణన్ తెలిపారు. ఐటీ పరిశ్రమ మళ్లీ పుంజుకునే వరకు వేతనాల పెంపు, పదోన్నతుల విషయాలను పరిశీలించబోమని, ఈ పరిస్థితి ఎన్నాళ్లుంటుందో చెప్పలేమని అన్నారు. మూడు నెలలకోసారి పరిస్థితిని అంచనా వేస్తామని, మెరుగైన వెంటనే వాటిపై దృష్టి పెడతామని చెప్పారు. వచ్చే ఏడాది ప్రథమార్థం చివర్లో ఐటీ రంగం గాడినపడే అవకాశాలు కనిపిస్తున్నాయని, జనవరిలో మళ్లీ కాలేజీలకు వెళ్లి కొత్త వారికి ఆఫర్లు ఇచ్చే వీలుందని వివరించారు.

## పోచారం ప్రాంగణం మరో ఏడాదిలో

హైదరాబాద్‌లోని పోచారంలో కంపెనీకున్న ప్రత్యేక ఆర్థిక మండలం (సెజ్)లో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. తొలి భవనం ఏడాది వ్యవధిలో సిద్ధం కానుంది. ప్రస్తుతం మాదాపూర్‌లోని కంపెనీ ప్రాంగణంలో 10,000 మంది పని చేస్తున్నారు. కొత్త ప్రాంగణం సిద్ధమయ్యే నాటికి పరిశ్రమ కోలుకుంటుందని, ఇప్పటికే ఆఫర్లు ఇచ్చిన వారిని, కొత్త వారిని ఇక్కడ నియమించనున్నామని గోపాలకృష్ణన్ చెప్పారు.

